

భారత్

# ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 310 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు బుధవారం, 02 సెప్టెంబర్ 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 310 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR WEDNESDAY, 02 SEPTEMBER 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI




2లో..

## స్వల్ప నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

నిఫ్టీకి 24,150-24,200 స్థాయి కీలక నిరోధంగా ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 24,200 పైన నిలకడగా ట్రేడైతే 24,300-24,400 స్థాయుల దిశగా పుంజుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు..

కొత్త నిబంధనలకు సడుగులు

అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..




2లో..



2లో..

## ఆగస్టులో జీఎస్టీ వసూళ్ల జోరు..

గతేడాదితో పోల్చితే 14.8 శాతం అధికం

తాత్కాలిక గణాంకాలు విడుదల


## హైడ్రా రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట



### సింగిల్ జడ్జ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు

హైదరాబాద్: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 3వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటి వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని మార్చాలనే సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి ఆదేశాల వరకు లోతుకుంటా భూముల జోలికి వెళ్లవద్దని హై కోర్టు స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు హైడ్రా కమిషనర్ వెళ్లిన విషయం తెలిసిందే. ఇదే కేసులో రంగనాథ్‌ని తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పునిచ్చారు. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి తీర్పుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు.

# పెన్షన్లతో ఆర్థిక భరోసా



- కుటుంబంలో పెరిగిన గౌరవం
- ఇప్పటి వరకూ రూ. 75 వేల 503 కోట్ల పెన్షన్లు ఇచ్చాం
- వీటితో మూడు పోలవరాలు కట్టగలం
- మంచి కోసం సూచనలు,సలహాలు స్వీకరిస్తా
- అభివృద్ధిని అడ్డుకుంటున్న గొడ్డలిపార్టీ
- మీ దీవెనలు ఇలాగే ఉంటే ఇంకా అభివృద్ధి చేస్తా
- మొగల్తూరు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు



2లో..

ప్రజా చైతన్య కార్యక్రమాలు తెచ్చాం. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేను. వైకాపా హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. 45 సంవత్సరాలుగా వెనుకబడిన వర్గాలు తెదేపాని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. త్వరలో మహిళా డ్రైవర్ల వ్యవస్థను తీసుకొస్తాం. వడ్డెర సమాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యంషాపులు కేటాయిస్తున్నాం.




## ఎపిలో సర్ గడువు పొడిగింపు

### సెప్టెంబర్ 10వ తేదీ వరకు అవకాశం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పొడిగించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి చేసిన అభ్యర్థన మేరకు ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో కీలక మార్పులు చేసింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాపై ÷-లకెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నా, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోయినా ఈ గడువులోగా ÷-లకెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని అధికారులు తెలిపారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు అక్టోబర్ 5వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఎస్ఐఆర్ పక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలోని ఓటర్ల జాబితా సవరణ పక్రియకు సంబంధించి ఈ తేదీలు మారాయి. సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను వెంటనే రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు



2లో..

# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

- కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా
- ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు
- కష్టకాలంలో మేము మాత్రమే కెసిఆర్‌ను వెన్నంటి ఉన్నాం
- కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీ మంత్రి వేముల



2లో..

2001 తెలంగాణ ఆవిర్భావానికి ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. టీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అంటేనే టీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చింద్రు.. మధ్యలో పోయింద్రని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత.. ఇప్పుడు కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా.. కవితనా? అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా.. కవితనా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు.

కనకదుర్గమ్మకు రూ.11 లక్షల బంగారు జడ కానుక..

భక్తి చాటుకున్న బొర్రా రాధాకృష్ణ



## కనకదుర్గమ్మకు బంగారు జడ సమర్పణ

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మకు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ప్రత్యేక కానుక సమర్పించారు. సుమారు రూ.11 లక్షల విలువైన బంగారు జడను అమ్మవారికి సమర్పించారు. దాదాపు 130 నుంచి 160 గ్రాముల బంగారంతో సంప్రదాయ శైలిలో రూపొందించిన ఈ ఆభరణంలో లక్ష్మీదేవి, ఇతర దైవిక రూపాలతో పాటు ఆకుపచ్చ రాళ్లు, ముత్యాలను అలంకరించారు. అమ్మవారి పట్ల తన భక్తిని చాటుతూ ఈ కానుకను సమర్పించినట్లు చెప్పారు.



# స్వల్ప నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, హెల్త్‌కేర్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్లపై ప్రభావం చూపింది. అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు ఇన్వెస్టర్లను అప్రమత్తం చేశాయి. సెన్సెక్స్ 12.99 పాయింట్లు నష్టపోయి 76,944.28 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24.60 పాయింట్లు తగ్గి 24,055.80 వద్ద ముగిసింది. నిఫ్టీకి 24,150-24,200 స్థాయి కీలక నిరోధంగా ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 24,200 పైన నిలకడగా ట్రేడైతే 24,300-24,400 స్థాయుల దిశగా పుంజుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అప్పటివరకు పైస్థాయుల్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశం ఉందన్నారు. మరోవైపు నిఫ్టీ 24,000 దిగువన నిలకడగా కొనసాగితే 23,900-23,800 ప్రాంతానికి పడిపోయే అవకాశముందని విశ్లేషకులు పేర్కొన్నారు. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, మారుతి సుజుకి ఇండియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు అధికంగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.39 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.23 శాతం క్షీణించాయి. రంగాల వారీగా చూస్తే హెల్త్‌కేర్, ఆటో, రియల్టీ, ఫార్మా సూచీలు వెనుకబడ్డాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ సూచీలు మాత్రం మెరుగ్గా రాణించి మార్కెట్‌కు కొంత మద్దతు ఇచ్చాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో ప్రపంచ ఆర్థిక పరిస్థితిపై ఆందోళనలు పెరిగాయని నిపుణులు తెలిపారు. సమీప కాలంలో ఇంధన మార్కెట్ల పరిణామాలు, ప్రపంచ వడ్డీ రేట్లపై అంచనాలు, వర్ధమాన దేశాల్లోకి పెట్టుబడుల ప్రవాహం మార్కెట్ దిశను నిర్ణయించే అవకాశం ఉందన్నారు.

# ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు..

న్యూఢిల్లీ: నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో కీలక మార్పులు రానున్నాయి. పథకాలను ఎలా వర్గీకరించాలి? వాటి వివరాలను ఎలా చూపించాలి? అన్నదానిపై పెన్షన్ నియంత్రణ సంస్థ పీఎఫ్ఆర్‌డీఏ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆగస్టు 28న జారీ చేసిన సర్క్యులర్‌లో ఈ మార్పులను ప్రకటించింది. 2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఇకపై ఎన్‌పీఎస్ పథకాలను ఈక్విటీ పెట్టుబడి ఆధారంగా ఐదు కేటగిరీలుగా విభజిస్తారు. 80-100 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ-ఏ'లో ఉంటాయి. వీటిని అత్యంత అధిక రిస్క్ ఉన్న 'అగ్రెసివ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 60-80 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-బి'లో ఉంటాయి. వీటిని అధిక రిస్క్ ఉన్న 'హై గ్రోత్' పథకాలుగా పేర్కొంటారు. 35-60 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-సి'లో ఉంటాయి. ఇవి మధ్యస్థ రిస్క్ ఉన్న 'బ్యాలెన్స్‌డ్ గ్రోత్' పథకాలు. 10-35 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-డి'లో ఉంటాయి. వీటిని 'కన్జర్వేటివ్'గా పరిగణిస్తారు. 0-10 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-ఈ'లో ఉంటాయి. ఇవి రుణ ఆధారిత పథకాలుగా ఉంటాయి. ఒక పథకం ఈక్విటీ పరిమితి రెండు కేటగిరీల్లోకి వచ్చేలా ఉండకూడదు. దీంతో పెట్టుబడిదారులు తమ రిస్క్ స్థాయికి తగ్గ పథకాన్ని సులభంగా ఎంచుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో చేరే వారికి మరో మార్పు కూడా ఉంది. అక్టోబర్ 1 నుంచి 'పాయింట్ ఆఫ్ ప్రజెన్స్' (పీఓపీ) ద్వారా కొత్తగా ఎన్‌పీఎస్ ఖాతా తెరిచే వారికి ఒక్కో పీఆర్ఏఎన్‌పై రూ.200 వన్‌టైమ్ ఛార్జీ వసూలు చేస్తారు. ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ప్రతి త్రైమాసికానికి రూ.50 చొప్పున యూనిట్లను రద్దు చేసి వసూలు చేస్తారు. పథకాలను ఎంచుకునే ముందు పెట్టుబడిదారులకు మరింత సమాచారం అందేలా పీఎఫ్ఆర్‌డీఏ చర్యలు తీసుకుంది. పథకం పేరు, పెన్షన్ ఫండ్, ప్రారంభ తేదీ, రాబడులు, బెంచ్‌మార్క్ ఛార్జీలు, రిస్క్‌మీటర్, నిర్వహణలో ఉన్న ఆస్తుల వివరాలు ఒకే విధానంలో కనిపించనున్నాయి. అయితే ప్రభుత్వ రంగ ఎన్‌పీఎస్ ఖాతాలకు కొత్త వర్గీకరణ వర్తించదు.

# ఆగస్టులో జీఎస్టీ వసూళ్ల జోరు..




న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధి చెందుతున్నదనడానికి సంకేతంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఆశాజనకంగా నమోదయ్యాయి. ఆగస్టు నెలకు గాను జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.1,99,853 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే ఇది 14.8 శాతం అధికం. ముఖ్యంగా దిగుమతులపై పన్నుల వసూళ్లు గణనీయంగా పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. ఈ మేరకు నేడు కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక గణాంకాలను విడుదల చేసింది. గత ఏడాది ఆగస్టులో జీఎస్టీ వసూళ్లు రూ.1,74,116 కోట్లుగా ఉండగా, ఈసారి దాదాపు రూ.2 లక్షల కోట్ల మార్కుకు చేరువయ్యాయి. అయితే, ఈ ఏడాది జులైలో నమోదైన రూ.2.11 లక్షల కోట్లతో పోలిస్తే ఆగస్టు వసూళ్లు కొంత తక్కువగా ఉన్నాయి. ఈ వృద్ధిలో దిగుమతుల నుంచి వచ్చిన జీఎస్టీ కీలక పాత్ర పోషించింది. దిగుమతులపై స్థూల జీఎస్టీ ఆదాయం ఏకంగా 29 శాతం పెరిగి రూ.62,604 కోట్లకు చేరింది. మరోవైపు, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ కూడా 9.3 శాతం వృద్ధితో రూ.1,37,249 కోట్లుగా నమోదైంది. అదే సమయంలో ఆగస్టు నెలలో ప్రభుత్వం చెల్లించిన రిఫండ్‌లు కూడా భారీగా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే రిఫండ్‌లు 67.9 శాతం పెరిగి రూ.31,795 కోట్లకు చేరాయి. దీంతో రిఫండ్‌లను మినహాయించిన తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం రూ.1,68,057 కోట్లుగా ఉంది. ఇది గతేడాది నికర ఆదాయంతో పోలిస్తే 8.3 శాతం మాత్రమే ఎక్కువ. నికర వసూళ్లను విశ్లేషిస్తే.. కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం 22.3 శాతం వృద్ధితో రూ.49,299 కోట్లకు చేరగా, దేశీయ నికర జీఎస్టీ వసూళ్ల వృద్ధి మాత్రం కేవలం 3.4 శాతానికే పరిమితమై రూ.1,18,759 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిఫండ్‌లు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ గణాంకాలు వెలువడిన నేపథ్యంలో సెప్టెంబర్ 12న న్యూఢిల్లీలో 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# పెన్షన్లతో ఆర్థిక భరోసా




భీమవరం: పెన్షన్లతో పేద కుటుంబాల్లో భరోసా నింపామని సిఎం చంద్రబాబు
అన్నారు. ఇప్పుడు ఆయా కుటుంబాల్లో పెద్దలకు గౌరవం దక్కుతోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి డ్వాక్రా సంఘాలను స్థాపించామని సీఎం తెలిపారు. తన తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదని దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారని అన్నారు. భవిష్యత్తులో మగవారిని మించిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్పుకొచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తూ ఆదుకుంటున్నామన్నారు. దేశంలో నాలుగు వేలు, ఆరువేలు, పదివేలు, పదిహేను వేలు పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీనే అని అన్నారు. ఇప్పటి వరకూ 75 వేల 503 కోట్ల రూపాయలను పెన్షన్లు ఇచ్చామని.. ఆ డబ్బుతో మూడు పోలవరం ప్రాజెక్టులు కట్టవచ్చన్నారు. ఆర్థిక అసమానతలు పోవాలని.. అందరికీ సంక్షేమం అందాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నోసార్లు నరసాపురం వచ్చానని..అనేక పాలనా సంస్కరణలకు నాంది పలికామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మొగల్తూరులో లబ్దిదారులకు పెన్షన్లను పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడుతూ.. తనకు మొగల్తూరు కొత్తేమీ కాదన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రజా కార్యక్రమాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని విమర్శించారు. అటువంటి పరిస్థితి నుంచి 94 శాతం సీట్లలో, 54 శాతం ఓట్లతో కూటమిని ప్రజలు గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇంకా బాగా జరగాలి.. అందుకోసం సలహాలు, సూచనలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సంక్షేమం పేదవాడిని నిలబెట్టాలి.. తాత్కాలిక ఉపశమనం ఉండాలన్నారు. చైనా సామెతను ఉదాహరిస్తూ..చేపలు అందించడం కాదు..చేపలు పట్టించడం నేర్పాలని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం సమృద్ధి సాధించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. ఆడ బిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా.. ఉచిత బస్సులు తెచ్చాం. దీపం పథకం ద్వారా 3 సిలిండర్లు ఇస్తున్నాం. పేదల సేవ కోసమే మొగల్తూరు వచ్చాను. సీఎం స్థాయిలో అనేక మార్పులు చేశాను. ఎంత సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను. అనేక సంస్కరణలకు నాంది పలికాం.. ప్రజా చైతన్య కార్యక్రమాలు తెచ్చాం. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేను. వైకాపా హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. 45 సంవత్సరాలుగా వెనుకబడిన వర్గాలు తెదేపాని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. త్వరలో మహిళా డ్రైవర్ల వ్యవస్థను తీసుకొస్తాం. వడ్డెర సమాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యంషాపులు కేటాయిస్తున్నాం. డీఎస్సీపై వైకాపా 350 కేసులు వేసింది. వైకాపా చేస్తోన్న ప్రచారాన్ని డీఎస్సీ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు పెంచాం. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా ఉంటుందని చంద్రబాబు అన్నారు. కొన్ని రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని.. వాటిని మహిళలు నడపాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. డ్వాక్రా ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా చూస్తామని చెప్పారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థిక సహాయాన్ని ఇవ్వడాన్ని తానే ప్రారంభించానని తెలిపారు. ఎలాంటి మంచి పనులు చేసినా అడ్డుపడుతున్నారని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ఏజెన్సీలోని పిల్లలకు మెరుగైన విద్య అందిస్తే, ప్రపంచంలోనే మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. వాటన్నింటికీ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని విమర్శించారు. 'ఎంత
అడ్డుపడినా నా ఆశయాన్ని ఆపలేరు' అని స్పష్టం చేశారు. డీఎస్సీని అడ్డుకోవడానికి 350 పిటిషన్లు వేశారని.. పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తే, కోడిగుడ్డుకు ఈకలు పీకుతున్నట్లు వ్యవహరిస్తున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారు గొడ్డలి పార్టీని హెచ్చరించినా వారిలో మార్పులేదన్నారు. త్వరలో ఏసీ బస్సులు వస్తున్నాయని.. మహిళలు ఉచితంగా ఆ బస్సుల్లో ఎక్కే రోజులు రాబోతున్నాయని తెలిపారు. మహిళలు ఇంటిపైన సోలార్ పెట్టుకుంటే విద్యుత్ తయారు అవుతుందని.. దానివలన కొన్ని రోజుల్లో ఉచితంగా కరెంటు పొందవచ్చని సూచించారు.

# మరోమారు సిజెపి ఆందోళన !

కాక్రోచ్ జనతా పార్టీ మరో ఆందోళనకు సిద్ధమవుతోంది. కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీజేపీ సెప్టెంబర్ 5న ఈ మార్చ్ చేపడుతోంది. గతంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన సందర్భంగా కేసుల ఎత్తివేత, విద్యార్థులకు పరిహారం వంటి హామీలను కేంద్రం ప్రకటించింది. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే హామీలు అమలు చేయాలని గతకొంత కాలంగా సిజెపి డిమాండ్ చేస్తూనే ఉంది. సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ఈ మార్చ్ నిర్వహించనున్నట్లు సీజేపీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ అంశంలో న్యాయపరంగా జోక్యం చేసుకోవాల్సి నంత అత్యవసర పరిస్థితి లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే నిరసన సందర్భంగా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో మరోమారు ఆందోళన చేస్తే ఢిల్లీలో ఉద్రిక్తతలు నెలకొంటాయని, మార్చ్‌కు అనుమతి నిరాకరించాలని రిటైర్డ్ పోలీస్ అధికారి సుప్రీంను ఆశ్రయించారు. సెప్టెంబర్ 5న జరగనున్న నిరసన మార్చ్ శాంతిభద్రతలు, విధానపరమైన అంశాలతో ముడిపడి ఉందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. వీటిని సంబంధిత శాంతిభద్రతల సంస్థలు, ఇతర భాగస్వాములు పరిష్కరించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం కోర్టు జోక్యం చేసుకోవాల్సిన బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేశారు. రిటైర్డ్ ఢిల్లీ పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జూలై 20న జంతర్ మంతర్ దగ్గర జరిగిన సీజేపీ నిరసన సందర్భంగా గాయపడిన పోలీసు సిబ్బందికి పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాలని పిటిషన్‌లో కోరారు. పార్లమెంట్, ఇతర కీలక ప్రభుత్వ సంస్థలకు సమీపంలో నిర్వహించే నిరసనలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించాలని పిటిషనర్ కోరారు. నిరసనలు నిర్వహించకూడని ప్రాంతాలు లేదా రక్షిత ప్రాంతాలను సహేతుకమైన పరిధిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ అంశానికి సంబంధించిన అనేక విషయాలను ఇంకా పరిశీలించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రతి అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించలేదని సీజేఐ స్పష్టం చేశారు. ముందుగానే దీనిపై ఎలాంటి నిర్ణయాలు ప్రకటించ లేమని సుప్రీం స్పష్టం చేసింది. అలాగే నిరసనలకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయించాలని సీజేఐ సూచించారు. అన్ని అంశాలను మేము పరిశీలించలేం. ప్రతి విషయంపైనా వ్యాఖ్యానించం. మేము ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయిం చండని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఒక్కో అంశాన్ని కమిటీ పరిశీలించి తమ అభిప్రాయాలను కోర్టుకు సమర్పిస్తుందని తెలిపారు. ఈ కమిటీని సీజేఐ 'తటస్థ అంపైర్'గా అభివర్ణించారు. నిరసనలకు సంబంధిం చిన విస్తృత విధానపరమైన, శాంతిభద్రతల అంశాలపై సంబంధిత వర్గాలు చర్చించు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు సీజేపీ తాజా నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు కోర్టుకు తెలియజేశారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న విషయాన్ని పిటిషనర్ సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ ప్రముఖులు ఢిల్లీకి రానున్న నేపథ్యంలో భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నాయని, అందువల్ల నిరసన మార్చ్‌ను బ్రిక్స్ సదస్సు పూర్తయ్యే వరకు వాయిదా వేయాలని ఆయన వాదించారు. అయితే సీజేఐ స్పందిస్తూ.. 'ఇవి
శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలు. నిర్ణయం శాంతిభద్రతల సంస్థలే తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని మేము విశ్వసిస్తున్నాం, ఆశిస్తున్నాం. ప్రస్తుతానికి మేము జోక్యం చేసుకోవడానికి బలమైన కారణాలు
కనిపించడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ నిరసన సందర్భంగా ఏదైనా అవాంఛనీయ లేదా ఆందోళనకర ఘటన చోటుచేసుకుంటే.. పిటిషనర్ కొత్తగా దరఖాస్తు చేసుకుని కోర్టును ఆశ్రయించవచ్చని సీజేఐ తెలిపారు. ఈ కేసును నిరసనలు, వాటికి సంబంధించిన ఇతర అంశాలపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలిపి తదుపరి విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. మొత్తంగా ఇప్పుడు సెప్టెంబర్ 5 మరోమారు చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలో ర్యాలీతో నిజంగానే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందా అన్నదే ప్రశ్న. ఎందుకంటే గత ఆందోళనలో అసాంఘిక శక్తులు చేరాయి. ఖలిస్తాన్, ఇస్లామిక్ ఉగ్రవాదులు చేరారన్న సమాచారం ఇంటిలిజెన్స్ వద్ద ఉంది. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

# తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

## తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు

## ఇప్పుడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్

వాషింగ్టన్: అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు. 'హెగ్సెత్ అద్భుతంగా పనిచేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్‌గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్‌లో హెగ్సెత్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్‌లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది.

అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పలువురు నేతలు ఇప్పటికే అంతర్గతంగా సన్నాహాలు ప్రారంభించి ఉండొచ్చని ట్రంప్ చెప్పారు. ఏది ఏమైనా ట్రంప్ వారసుడిగా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించనప్పటికీ.. జేడీ వాన్స్, మార్కో రూబియో, హెగ్సెత్ వంటి పేర్లు వినిపిస్తుండటం రిపబ్లికన్ పార్టీలో 2028 పోరుపై ఆసక్తి రేపుతోంది.

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

న్యూఢిల్లీ: భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు
పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

నిజామాబాద్: కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురిని కలిసి రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కెసిఆర్‌కు నమ్మకబంట్లుగా ఉన్న వారిని విడదీసి పార్టీని బలహీన పర్చాలన్న ఎజెండాతో కవిత పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. కవితను కేసీఆర్‌ను కలపడానికి ప్రయత్నం చేసిన, విడగొట్టడానికి ప్రయత్నం చేసిన విషయం కేసీఆర్‌కు బాగా తెలుసు. పార్టీ లైన్ దాటిన తర్వాత కేసీఆర్ కవితను పార్టీ నుంచి వేటు వేశారని అన్నారు. నేను, మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం. 2001 తెలంగాణ ఆవిర్భావానికి ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. టీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అంటేనే టీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చింద్రు.. మధ్యలో పోయింద్రని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత.. ఇప్పుడు కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా.. కవితనా? అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా.. కవితనా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదు. కవిత కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదని చెప్పగలరా? కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో మంతనాలు చేయలేదని చెప్పగలరా?
అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం కవిత చేస్తున్నారు? స్వలాభం కోసం వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని అన్నారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి, పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కవిత సభలో కన్నీళు పెట్టుకోవడంపై స్పందిస్తూ.. రాజకీయంగా సింపతిని గెయిన్ చేయడానికి అని అర్థం అవుతుంది. అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నాం. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయనపైన, కేటీఆర్‌పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కానీ బాధగా అనిపించింది. సొంత లాభం కోసం కవిత మాట్లాడటం పెద్ద బాధగా అనిపించలేదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవితపై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రయోజనాలను సూచించే 'బాకీ కార్డులకు' ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆ హామీలను అమలు చేస్తామని చెప్పిందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల ద్వారా ఎంత మేర బాకీ పడిందో ప్రజలకు తెలియజేస్తూ, ఇచ్చిన హామీలను ఇకనైనా నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'బాకీ కార్డుల పూజ' కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల ముందుంచారు.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

గుంటూరు వార్తలు
బుధవారం, 02 సెప్టెంబర్ 2026



# ప్రతీ రైతు సమస్యనూ పరిష్కరిస్తాం : డా. పెమ్మసాని

**గుంటూరు, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వట్టిచెరుకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీ భూమి - మీ హక్కు కార్యక్రమంలో భాగంగా 22- ఏ భూ సమస్యలను పరిష్కరించి ధ్రువీకరణ పత్రాలను అందజేసే కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే బి. రామాంజనేయులు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ తో కలిసి లబ్ధిదారులకు పట్టాలు మంగళవారం పంపిణీ చేశారు. వట్టిచెరుకూరు గ్రామ ముఖద్వారం నుంచి కేంద్ర మంత్రి పెమ్మసానిని, రెవెన్యూ శాఖ మంత్రి ప్రసాద్ ని, ఎమ్మెల్యే రామాంజనేయులుని, భాష్యం రామకృష్ణని సభ ప్రాంగణం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర గ్రామస్తులు భారీ ర్యాలీగా తీసుకువెళ్లారు.









**ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ** ప్రభుత్వం వచ్చాక 22- ఏ భూ సమస్యలను ఒక ప్రజా సమస్యగా తీసుకొని పరిష్కరిస్తుందన్నారు. ఎప్పటికప్పుడు ప్రత్యేక సమావేశాలు నిర్వహించుకుంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా పని చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ 22 - ఏ సమస్యలు ఉన్నప్పటికీ ముందుగా గుంటూరులో ఎందుకు పరిష్కరించబడ్డాయి అంటే ఆయా నాయకుల కృషి, చొరవ మాత్రమే కారణమని ప్రతి ఒక్కరు గుర్తించాలి. సుమారు 120 ఏళ్ల క్రితం ఏర్పడ్డ 22- ఏ సమస్య వల్ల దశాబ్దాలుగా రికార్డుల తారుమారు, రీసర్వే లో సమగ్రంగా జరగకపోవడం వంటి సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. అదేవిదంగా ఇళ్ల పట్టాలు లేని నిరుపేదలకు మంగళగిరి నియోజకవర్గ కేంద్రంగా నారా లోకేష్ చేతులమీదుగా ఆయా ప్రజలకు పట్టాలు అందజేయడం కూడా జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నా పరిధిలోకి వచ్చే గ్రామీణ అభివృద్ధిలో ఉండే చెరువులను అభివృద్ధి పరచడమే కాకుండా ఎన్నో మౌలిక వసతులను కూడా అభివృద్ధి పరుస్తున్నాము. రూ. 100 కోట్ల నిధులతో ఆయుర్వేద హాస్పిటల్ లో అందుబాటులోకి ఈ నియోజకవర్గంలో తీసుకురాబోతున్నాము. త్వరలోనే ఆసుపత్రికి శంకుస్థాపన కూడా చేయబోతున్నాము. మన ప్రాంతంలో ప్రత్తి కొనుగోళ్ళ ఇబ్బందులు కలిగిన రోజున అధికారులతో చర్చించు మరి రైతులకు న్యాయం చేసిన ఘనత మనది. ప్రతి ఏటా లక్ష బస్తాలు యూరియా మన ఆంధ్రప్రదేశ్కు వస్తున్నప్పటికీ, గత సంవత్సరం 1,40,000 బస్తాలు వచ్చినా, రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడ్డారు. ఆ సమస్యను పరిష్కరించే విధంగా సాంకేతిక విధానాన్ని అమలులోకి తీసుకువస్తున్నాము. ఎదిగింది అమెరికాలో అయినా పుట్టింది, పెరిగింది ఇక్కడే కాబట్టి ప్రతి రైతు సమస్య నాకు తెలుసు. ప్రతి రైతు సమస్యను పరిష్కరిస్తాం ప్రతి రైతు కన్నీళ్లను తుడుస్తామని తెలియజేసారు.

**అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ,** నీతి, నిజాయితీకి నిలువెత్తు రూపం అయిన స్వయాన ప్రధానమంత్రి నెంబర్ వన్ ర్యాంక్ ఇచ్చినటువంటి ఎంపీ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వంటి నాయకులు ప్రతి పార్లమెంటులో ఉండాలి. వట్టిచెరుకూరు గ్రామానికి ఎంతో అరుదైన చరిత్ర ఉంది. ఇవాళ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన భూ సమస్య పరిష్కారం ఏదైతే ఉందో అది మరో గొప్ప చరిత్రగా తీర్చిదిద్దుకుంది. ఇది కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో భాగంగా, ప్రభుత్వం యొక్క పనితీరుకు తార్కాణంగా ఇవాళ జరిగే ధ్రువీకరణ పత్రాల పంపిణీ నిలుస్తుంది. ఈరోజు కొందరు వ్యక్తులు ఉన్నటువంటి ఈ పరిష్కారాలను చూసి తమ భూములు కూడా 22-ఏ కారణంగా ఇబ్బందుల్లో ఉన్నాయని, తమకు కూడా పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. సమర్థవంతులైన నాయకులు ఉన్నారని తెలిసి ఒక్కొక్కరుగా తమ సమస్యలను బయటకు తీసుకువస్తుండటం విశేషం. ఈ రోజు ప్రజలకు ఉన్న సమస్యలలో 70% రెవెన్యూకు సంబంధించినవి ఉన్నాయి. వచ్చిన తర్వాత వాటిల్లో మాక్సిమం సమస్యలను పరిష్కరించగలుగుతున్నాము. ఇందుకు నిదర్శనంగా వట్టిచెరుకూరు, పుల్లడిగుంట, ఏటుకూరు ప్రాంతాలు నిలుస్తున్నాయి. గత ప్రభుత్వం చేసింది ఏమైనా ఉంటే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకురావడమే. ఈ అక్ట్ ద్వారా ప్రజల ఆస్తులపై పెత్తనం చేయాలని ఆ పార్టీ నాయకులు ప్రయత్నించారు.రీసర్వే విధానాన్ని కూడా 2014 - 19 సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అమల్లోకి వచ్చింది. 'నేను అంటే అహంకారం - మేము అంటే మమకారం' అని నమ్మి పనిచేసేటువంటి మన పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ రీసర్వే కార్యక్రమం మరింత వేగం పుంజుకుంది. వైసిపి హయాంలో ప్రజ లు సంపాదించుకున్న భూముల పట్టా పాస్ బుక్కులపై జగన్ ఫోటోలు ముద్రించుకున్న చరిత్ర ఆ పార్టీది.

**ఎమ్మెల్యే బి. రామాంజనేయులు మాట్లాడుతూ,** నేను కలెక్టర్ గా ఉన్నప్పుడు కూడా పరిష్కారం దానికి సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పరిష్కరించారు. సుమారు ఏడాది క్రితం నేను రెవెన్యూ మంత్రిని కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరగా, నిబంధనలను అనుసరించి కచ్చితంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారమే ఏడాది తిరిగేలోపు సమస్యను పరిష్కరించారు. అందులో భాగంగానే వట్టిచెరుకూరు, పుల్లడిగుంట, ఏటుకూరు ప్రాంతాల్లోని వందల కుటుంబాలకు ఆధీనంలో ఉన్న 22-ఏ భూ సమస్యలను పరిష్కరించి యజమానులకు శాశ్వత హక్కు కల్పించారని తెలియజేశారు.

**ఎంపీ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ,** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో మీ భూమి మీ హక్కు ద్వారా శాశ్వత పరిష్కారం అందుకున్న ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. ఎన్నో దశాబ్దాలుగా ఉన్నటువంటి పెయింటింగ్ సమస్యను కోటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మాత్రమే పరిష్కారం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర అమెరికాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం, కలెక్టర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అసుతోష్ శ్రీ వాత్సవ, ప్రతిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రదానం : జీఎంసీ కమీషనర్

**గుంటూరు, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత అత్యంత ప్రధానమని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని బ్రాడీపేట, కాకుమానువారి వీధి, లాంచెస్టర్ రోడ్, సంపత్ నగర్ తదితర ప్రాంతాలలో జరుగుతున్న మరియు పూర్తైన అభివృద్ధి పనులను, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణాల్లో నూరు శాతం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నిర్వహణలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాల మధ్య సమన్వయం ఉంటేనే పనులు వేగంగా, సమర్థవంతంగా జరుగుతాయన్నారు. ప్రారంభించిన అభివృద్ధి పనులు



పెండింగ్ లో లేకుండా కాంట్రాక్టర్లు పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. నిర్మాణ సమయంలోని వ్యర్థాలను వెంటనే తొలగించాలని, డ్రైన్లు, రోడ్ కి మధ్య లెవల్ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్రాడీపేటలో త్రాగునీటి శ్యాంపిల్స్ తీయడంలో నిర్లక్ష్యంగా ఉన్న ఎమినిటి కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎస్ఈని, రోడ్లపై నిర్మాణ సామగ్రి వేసిన వారికి నిర్మాణ పనులు ఆపాలని నోటీసు ఇవ్వాలని ఏసిపీని ఆదేశించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, ఖాళీ స్థలాల శుభ్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. లాంచేస్టర్ రోడ్ మెయిన్ డ్రైన్ లో పూడికను తొలగించాలన్నారు. ఈ పర్యటనలో ఎస్ఈ సుందరామిరెడ్డి, ఈఈలు విష్ణు, వేణు, డిఈఈలు వెంకటరమణ, సతీష్, చైతన్య, ఏసిపీ రెహ్మాన్, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పింఛన్ అంటే ఆత్మీయ భరోసా : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒకటో తేదీ ఉదయాన్నే అవ్వతాతల ముఖాల్లో ఆనందం చూస్తున్నామని, ఇదొక పండుగ రోజని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక క్రిస్టియన్ పేటలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ప్రతి ఇంటికీ పింఛన్ వస్తుందా ? ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా ? వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ తీసుకున్న లబ్ధిదారులు ఒకటో తేదీన ఇంటికి పెద్ద కొడుకులా తమను సీఎం చంద్రబాబు నాయుడు ఆదుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడాలేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో అత్యధికంగా



పింఛన్ అందిస్తోన్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. మన పక్క రాష్ట్రమైన తెలంగాణలో కేవలం రూ.2 వేలు మాత్రమే పింఛన్ ఉంటే ఏపీలో రూ.4 వేలు అందిస్తున్నామని తెలిపారు. వికలాంగులకు రూ.6 వేలు, ప్రత్యేక పరిస్థితుల్లో వారికి రూ.10 వేలు, రూ.15 వేలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రూ.30 వేల కోట్ల విలువైన పింఛన్లు అందించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఎరియర్స్ తోపాటు పింఛన్లు రెట్టింపు చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచి లబ్ధిదారులను మోసం చేశారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో కుటుంబంలో ఎవరైనా పింఛన్ తీసుకుంటూ ఎవరైనా మరణిస్తే భాగస్వామికి మరుసటి నెలలో స్పౌజ్ కేటగిరీలో మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని, ఇది ప్రజా ప్రభుత్వమని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని పింఛన్లు స్వయంగా మంజూరు చేయించామన్నారు.

# రావెల కిషోర్ బాబు పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

**గుంటూరు, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు ఇటీవల చేసిన ఆరోపణలను రిజిస్ట్రేషన్ శాఖ మాజీ డిఐజీ చావలి బాలస్వామి, అడ్వకేట్ రాయపూడి మాణిక్యారావు, కాకుమాను పున్నారావు ఖండించారు. తన పై నిరాధారమైన ఆరోపణలు చేశారని చెప్పారు. మంగళవారం బాలస్వామి, మాణిక్యారావు, పున్నారావు మీడియాతో మాట్లాడారు. ఎలాంటి అగ్రిమెంట్ లేకుండా నాలుగున్నర కోట్ల రూపాయలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు చేసిన కిషోర్ బాబు పై పరువు నష్టం దావా వేస్తామని వెల్లడించారు. ఒక మంత్రిగా పని చేసిన వ్యక్తి అసైన్డ్ భూములు ఎలా కొనుగోలు చేశారని తెలిపారు. ఎన్నికల సమయంలో బాలస్వామి ద్వారా డబ్బులు కూడా తీసుకున్నారని తెలిపారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన కిషోర్ బాబు పై సమగ్రంగా దర్యాప్తు జరిపి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



# వట్టిచెరుకూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**వట్టిచెరుకూరు, 01 సెప్టెంబరు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఎన్.టి.ఆర్ భరోసా పించన్లను కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్, రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, పార్లమెంట్ సభ్యులు భాష్యం రామకృష్ణ, ప్రత్తిపాడు శాసన సభ్యులు డా.బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ వట్టిచెరుకూరులో మంగళవారం పంపిణీ చేశారు. నూట ఇరవై సంవత్సరాల భూ సమస్యకు పరిష్కారం చేస్తూ వట్టిచెరుకూరు, పుల్లటగుంట, ఏటుకూరు గ్రామాల్లో 812 కుటుంబాలకు శాశ్వత పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. మరియు పింఛనుదారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులతో కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని సమీక్ష



**గుంటూరు, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్.హెచ్.ఎ.ఐ రీజినల్ ఆఫీసర్, ప్రాజెక్ట్ డైరెక్టర్లతో పెమ్మసాని క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. గుంటూరు - విజయవాడ పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారులకు సంబంధించిన కీలక సమస్యలు, పెండింగ్ పనుల పురోగతిపై ఈ సందర్భంగా అధికారులతో కేంద్ర మంత్రి సమగ్రంగా చర్చించారు. సమావేశంలో ప్రధానంగా వెస్ట్ బైపాస్పై చిన్నకాకాని ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన డి పి ఆర్ తయారీ, తదుపరి కార్యాచరణ, కాల పట్టికపై సమీక్షించారు. ఔటర్ రింగ్ రోడ్ ప్రతిపాదనలు, కేంద్ర ప్రభుత్వానికి పంపిన నివేదికలు, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుద్దపల్లి డొంక వద్ద ఆర్ యు బి /డ్రెయిన్ అవుట్లెట్, వెంకటపాలెం టోల్ ప్లాజా సమస్యలు, పెదకాకాని వై జంక్షన్ను ప్రమాద రహిత ప్రాంతంగా తీర్చిదిద్దే చర్యలు తదితర అంశాలపై కూడా చర్చ జరిగింది. అదేవిధంగా కొలనుకొండ, సుద్దపల్లి డొంక వద్ద నిర్మాణంలో ఉన్న రెండు ఆర్ఓబిల పనులు నెమ్మదిగా సాగుతున్న అంశంపై మంత్రి ఆరా తీశారు. పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అమృత్ 2.0 పథకం కింద పైప్లైన్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు మంజూరు చేసే అంశంపైనా సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారి మౌలిక వసతుల పనులను వేగవంతం చేయడం, ప్రమాదాలను నివారించడం, పెండింగ్ సమస్యలకు త్వరిత పరిష్కారం చూపడమే లక్ష్యంగా అధికారులతో మంత్రి పెమ్మసాని సమీక్షించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవేస్ రీజినల్ ఆఫీసర్ హరికృష్ణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ సుర్జేవాలా మరియు జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి దిశగా సాగుతోంది

వీఐటి యూనివర్సిటీ కార్యక్రమంలో డా. పెమ్మసాని



**గుంటూరు, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినం సందర్భంగా అమరావతిలోని వీఐటి యూనివర్సిటీకి చెందిన సుమారు పదివేల మంది విద్యార్థినీ విద్యార్థులు పోస్ట్ కార్డుల ద్వారా ప్రధానమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ లేఖలు రాయడం జరిగింది. గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంగళవారం పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా విద్యార్థులను ఉద్దేశించి పెమ్మసాని మాట్లాడుతూ, ప్రేమతో రాసిన చిన్న పోస్ట్కార్డు కూడా ఒక వ్యక్తికి ఎంతో బలాన్ని, ప్రోత్సాహాన్ని ఇస్తుంది. గతంలో ఉన్న కష్టాలను మర్చిపోవద్దని, గత 10-15 ఏళ్లలో వచ్చిన మార్పులను ప్రజలు గమనించాలని కోరారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలపై ప్రజలు కనీసం 10 నిమిషాలు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్ ప్రాధాన్యత పెరుగుతోందని, దేశ ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయిలో మరింత బలపడుతోంది. మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి, సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## లబ్ధిదారుల ముంగిటకే పింఛన్ల పంపిణీ

మొదటి రోజే 92 శాతం పూర్తి
వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర
అరండల్‌పేటలో స్వయంగా పింఛన్లు
అందజేసిన కమిషనర్



**విజయవాడ, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి :** విజయవాడ నగరంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియ వేగవంతంగా సాగింది. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం అరండల్‌పేట పరిసర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (FRS) ద్వారా పింఛన్ మొత్తాలను స్వయంగా పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరవ్యాప్తంగా మధ్యాహ్నం 3 గంటల సమయానికే మొత్తం 63,941 పింఛన్లకు గాను 59,260 మందికి (దాదాపు 92 శాతం) నగదు పంపిణీ పూర్తయిందని తెలిపారు. సర్కిల్-1లో 17,938, సర్కిల్-2లో 23,239, సర్కిల్-3లో 18,083 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేసినట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో పింఛన్లు అందేలా అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అరండల్‌పేటకు చెందిన లబ్ధిదారులు మీనాక్షి, తిరుపతమ్మ, సతీష్, స్వరాజ్యం తదితరులతో కమిషనర్ మాట్లాడి, పింఛన్ అందుతున్న తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, సీడీఓ జగదీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

## సింగ్‌నగర్‌లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

యంత్రాలతో ఔట్‌ఫాల్ డ్రెయిన్లలో పూడికతీత
వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో ముమ్మర పనులు



**విజయవాడ, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచే చర్యల్లో భాగంగా మంగళవారం సింగ్‌నగర్ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు సర్కిల్--2 పరిధిలోని 60వ వార్డు వాంబే కాలనీ, సింగ్‌నగర్ యార్డ్ రోడ్ ఔట్‌ఫాల్ డ్రెయిన్ ప్రాంతంలో ముమ్మరంగా వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు. బయాలజిస్ట్ సూర్య నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ?డ్రెయిన్ పరిసరాల్లో భారీగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారాన్ని 'లాంగ్ ఆర్మ్ 245 సీసీ మెకానికల్ యంత్రం' సాయంతో తొలగించి డ్రెయిన్‌ను శుభ్రం చేశారు. వర్షపు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా, ఎక్కడా నీరు నిలవకుండా డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. స్థానికులు డ్రెయిన్లు, బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను పారవేయకుండా నగరపాలక సంస్థ సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా పవర్ చిత్రం ప్రారంభోత్సవం



**విజయవాడ, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** వీఆర్పీ క్రియేషన్స్ పసుపులేటి వెంకటరమణ రచన,దర్శకత్వంలో నిర్మించిన 'పవర్' చిత్రం సినిమా ఆటోగ్రాఫ్ సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. సౌత్ ఇండియా ఫిలిం ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో 'పవర్' చిత్రం ఆడియో పరిచయం ప్రెస్ క్లబ్ గాంధీ నగర్ విజయవాడ నందు మంగళవారం ఘనంగా నిర్వ హించారు. పవన్ కళ్యాణ్ రాజకీయ జీవితం లో జరిగిన యదార్ధ సంఘటనలు ఆధారాలు 'పవర్' చిత్రం నిర్మించారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదల కు సిద్ధంగా ఉందని వెంకటరమణ తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో సిఫా సభ్యు లు పాల్గొన్నారు.

# గంజాయి సమాచారం ఇచ్చి బహుమతి పొందండి

'రైజ్ ఎగైనెస్ట్ గంజా' పేరుతో భారీ అవగాహన సదస్సు నిర్వహించిన కాకినాడ జిల్లా పోలీస్

**కాకినాడ బ్యూరో, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో "రైజ్ ఎగైనెస్ట్ గంజా"పేరుతో విద్యార్థులు, యువత, ప్రజలకు గంజాయికి వ్యతిరేకంగా విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబ వ్యవస్థకు, సమాజానికి తీవ్రనష్టం కలిగిస్తుందని అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులతో పాటు విద్యార్థులు, యువత, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం "రైజ్ ఎగైనెస్ట్ గంజా" పోస్టర్ ను ఎస్పీ చేతుల మీదుగా విడుదల చేశారు. సమాచారం ఇవ్వండి సమాజాన్ని కాపాడండి గంజాయి రహిత సమాజం మనందరి బాధ్యత" అనే నినాదాలతో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.గంజాయికి సంబంధించిన సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, విలువైన సమాచారాన్ని అందించిన వారికి తగిన బహుమతి కూడా అందజేస్తామని జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ తెలిపారు.

**గంజాయి సమాచారాన్ని ఇలా అందించండి**




**1972 - గంజాయి సమాచారం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్**
**112 - అత్యవసర పోలీసు సేవలు కాకినాడ పోలీస్ వాట్సాప్ నంబర్: 9494933233**

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడమే కాకుండా, తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి వినియోగం, విక్రయం లేదా అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును కాపాడుకోవడంతో పాటు, మాదకద్రవ్యాల నిర్మూలనలో బాధ్యతాయుతమైన పౌరులుగా భాగస్వాములు కావాలని, గంజాయి వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, ఇతర అనర్థాలను తెలిపారు. అనంతరం గంజాయి రహిత సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు, స్థానిక ప్రజలు మరియు పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. గంజాయిని పూర్తిగా నిరాకరిస్తామని, మాదకద్రవ్యాల వినియోగానికి



దూరంగా ఉంటామని, సమాజంలో గంజాయి నిర్మూలనకు తమవంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.మాదకద్రవ్యాల రహిత కాకినాడ జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కాకినాడ జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా.మహంతి కిషోర్ కుమార్, పోర్ట్ ఇన్స్పెక్టర్ పి. సునీల్ కుమార్, వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. నాగ దుర్గారావు, టూటౌన్ ఇన్స్పెక్టర్ మజ్జి అప్పలనాయుడు, కాకినాడ రూరల్ ఇన్స్పెక్టర్ డి. కృష్ణ చైతన్య, త్రీటౌన్ ఇన్స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ డి. దుర్గా శేఖర్ రెడ్డి, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ వి. శ్రీనివాసరావు, తిమ్మాపురం ఎస్సై వై. గణేష్ కుమార్, ఎస్బీ ఎస్సై శోభన్ కుమార్, పోలీసు సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు, స్థానిక ప్రజలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## హోటళ్లు టిఫిన్ సెంటర్ల పై వీఎంసీ కొరడా



వాటర్ ప్లాంట్లు, ఆహార కేంద్రాల్లో ముమ్మర తనిఖీ
నోటీసులు జారీ
నిబంధనలు పాటించకుంటే ట్రేడ్ లైసెన్సులు రద్దు

**విజయవాడ, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నగర ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఆర్వో వాటర్ ప్లాంట్లపై విజ యవాడ నగరపాలక సంస్థ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు మంగళవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వ హించారు. కలరా హాస్పిటల్, మిల్క్ ఫ్యాక్టరీ, ధోబీ ఖానా, లయోలా కాలేజ్ రోడ్డు పరిధిలోని మణికంఠ టిఫిన్ సెంటర్, శ్రీకృష్ణ వాటర్ ప్లాంట్, వీనస్ చికెన్ షాప్, మాధురి కర్రీస్ పాయింట్, తిరుమల టిఫిన్స్ సహా పలు ఆహార విక్రయ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. తయారీ ప్రదేశాల్లో పరిశుభ్రత ప్రమాణాలు, తడి-పొడి చెత్త నిర్వహణ, డస్ట్‌బిన్ల ఏర్పాటు, పరి సరాల పారిశుధ్యాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొన్ని కేంద్రాల్లో పరిశుభ్రతా లోపాలు, ఆహార వ్యర్థాలను సరిగ్గా నిర్వహించకపోవడం, డస్ట్‌బిన్లు లేకపో వడాన్ని గుర్తిం చిన అధికారులు సంబంధిత యజమానులకు తక్షణమే నోటీ సులు జారీ చేశారు. ఏడు రోజుల్లోగా లోపాలను సరిదిద్దుకోవాలని, లేనిప క్షంలో జరిమా నాలు విధించడంతో పాటు ట్రేడ్ లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రజారోగ్యానికి భంగం కలిగించే వ్యాపార సంస్థలపై నిరం తరం తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. తనిఖీల్లో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


## అసంపూర్తిగా వదిలేసిన సచివాలయ భవనం పునర్నిర్మాణం

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ బ్యూరో, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని గైగోలుపాడు నందు గత ప్రభుత్వ హయాంలో అసం పూర్తిగా వదిలేసిన రమణయ్యపేట-04 సచివాలయ భవనాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహ కారంతో రూ. 10 లక్షల గ్రామ పంచాయతీ నిధులు వెచ్చించి పునర్నిర్మాణంచి కూటమి నాయకులతో కలిసి ప్రారంభించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అసంపూర్తిగా వదిలేసిన రమణయ్యపేట-04 సచివాలయ భవనాన్ని రూ. 10 లక్షల పంచాయతీ నిధులతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. అదే విధంగా గత పాలకులు అసంపూర్తిగా వదిలేసిన వెల్‌నెస్ సెంటర్‌ను కూడా రూ.13 లక్షల నిధులతో పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రూరల్ టీడీపీ ఇంచార్జ్ పిల్లి అనంతలక్ష్మి, డా. చప్పిడి వెంకటేశ్వర రావు, పెంకే శ్రీనివాస్ బాబా, వీరబాబు (బుజ్జి), మేక లక్ష్మణ మూర్తి నులుకుర్తి వేంకటేశ్వర రావు పాల్గొన్నారు.

## జిమ్ ట్రైనర్ సతీష్ రెడ్డి హత్య పై ఎందుకీ మౌనం



కటౌట్ శ్రీను పాత్ర పై నోరు మెదపరెం.. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

**కాకినాడ బ్యూరో, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాకినాడలో అదుపుతప్పిన శాంతి భద్రతలు ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రశాంతతకు మారుపేరైన కాకినాడలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని వైఎస్ఆర్సీపి కాకినాడసిటీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నగర నడిబొడ్డున భానుగుడి సెంటర్ లో జిమ్ ట్రైనర్ సతీష్ రెడ్డి దారుణ హత్య ఇందుకు ప్రధాన నిదర్శనమన్నారు. సతీష్ రెడ్డి హత్య వెనుక టిడిపి నాయకుడు కటౌట్ శ్రీను పాత్ర ఉందని సతీష్ రెడ్డి భార్య జయశ్రీ స్వయంగా ఆరోపించినప్పటికీ ఇప్పటివరకు పోలీసులు ఎందుకు చర్య తీసుకోలేదని ద్వారంపూడి ప్రశ్నించారు. అతని వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఎవరు? కటౌట్ శ్రీను పై చర్యల విషయంలో పోలీసులు ఎందుకు తాత్సారం చేస్తున్నారు? హత్య జరిగి వారం రోజులు గడుస్తున్న ఇప్పటివరకు చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనకాడుతున్నారు ? ఎవరి ఒత్తిడి వల్ల నిందితులను కాపాడుతున్నారు? అంటూ ద్వారంపూడి ప్రశ్నలు సంధించారు. ఒక్క సతీష్ రెడ్డి హత్య కాకుండా... గడచిన కొద్ది రోజులుగా కాకినాడలో శాంతిభద్రతల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలవొగ్గి నిందితులను కాపాడాలని చూస్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# వివిఐటియు లో 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' చిత్ర బృందం సందడి

**నంబూరు, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య హీరో హీరోయిన్లుగా, ఆదిత్య హాసన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, ప్రచార కార్యక్రమాలు మరియు పాటల విడుదల వేడుకల్లో భాగంగా చిత్ర బృందం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ యూనివర్సిటీ (VVITU) ని సందర్శించింది. ఈ సందర్భంగా చిత్రంలో హిషామ్ అబ్దుల్ వహాబ్ సంగీత సారథ్యంలో రూపొందించిన "సబ్కో సింగిల్" అనే పాటను విద్యార్థుల హర్షధ్వనుల నడుమ ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్య, వివిఐటియు రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ** "వివిఐటియు క్యాంపస్‌కు




రావడం, మీ అందరి ఉత్సాహాన్ని చూడటం ఎంతో సంతోషంగా ఉంది. కాలేజీ నేపథ్యంతో, నేటి యువత భావోద్వేగాలకు అద్దం పట్టేలా ఈ చిత్రాన్ని రూపుదిద్దాం. 'సబ్కో సింగిల్' పాటతో పాటు సినిమాలోని ప్రతి అంశం మిమ్మల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది. సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల కానున్న 'ఎపిక్ - ఫస్ట్



సెమిస్టర్' చిత్రాన్ని వీక్షించి మా చిత్ర బృందాన్ని ఆశీర్వదించాలని కోరుతున్నాను" అని తెలిపారు.

**హీరోయిన్ వైష్ణవి చైతన్య మాట్లాడుతూ** వివిఐటియు విద్యార్థులు చూపించిన అభిమానం మరియు ఎనర్జీ అద్భుతమని, ఈ చిత్రం యువత అందరికీ బాగా కనెక్ట్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బాపట్ల ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలకు వాలీబాల్ రన్నర్స్ అప్ స్థానం




**బాపట్ల, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతింధి న్యూస్ :** బాపట్ల ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినులు 2026 ఆగస్టు 24 నుండి 29 వరకు తిరుపతిలో నిర్వహించిన వాలీబాల్ అమరావతి ఛాంపియన్‌షిప్ 2026లో ఎంతో ఉత్సాహంతో పాల్గొని, అద్భుతమైన క్రీడా ప్రతిభ, క్రమశిక్షణ, సమిష్టి కృషి మరియు పట్టుదలను ప్రదర్శించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో కళాశాల విద్యార్థినులు పి. హర్షిణి, కె. శ్రుతి, టి. తనుశ్రీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రన్నర్స్‌అప్ (ద్వితీయ స్థానం) సాధించారు. ఈ విశిష్ట విజయం కళాశాలకు ఎంతో గర్వకారణంగా నిలిచింది.అమరావతి ఛాంపియన్‌షిప్ వాలీబాల్ - 2026లో రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రూ. 50,000/- నగదు బహుమతి లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జస్త్ర హిమ బిందు విద్యార్థినులను అభినందిస్తూ, వారి అంకితభావం, కృషి మరియు క్రీడా స్ఫూర్తిని ప్రశంసించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మరియు ఫిజికల్ డైరెక్టర్ ఎం. సంయుక్త అభినందించారు. ఈ విజయం కళాశాల విద్యార్థినులలో క్రీడా స్ఫూర్తి, శారీరక దృఢత్వం, సమిష్టి కృషి, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ మరియు సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని ప్రోత్సహించడంలో కళాశాల నిబద్ధతకు నిదర్శనం. భవిష్యత్తులో కూడా క్రీడల్లో మరింతగా పాల్గొని రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో ఉన్నత విజయాలు సాధించాలని విద్యార్థినులను ప్రోత్సహించారు.

## రైతులు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి






మండల వ్యవసాయ అధికారి ఫారుఖ్

**చెరుకుపల్లి, 01 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మండల పరిధిలోని రాజవోలు, ఆళ్లవారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఏవో) ఎండి. ఫారుఖ్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. పీఎం కిసాన్ లబ్ధిదారులైన రైతులు రాబోయే విడత నిధులు పొందడానికి తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుత ఖరీఫ్ సీజన్ వరి సాగులో కలుపు నివారణ చర్యలను వివరిస్తూ.. వరి నాటిన 72 గంటల లోపు ఎకరానికి ఆక్సాడయార్జిల్ 80 గ్రాములు లేదా పైరజోసల్ఫురాన్ ఇథైల్ 80 గ్రాముల మందును ఇసుకలో కలిపి చల్లుకోవాలని, అనంతరం పొలం నుంచి నీరు బయటకు పోకుండా నిల్వ కట్టడం ద్వారా కలుపును సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు బి.డి. రామకృష్ణ, టి. అఖిల, వీఏఏ లక్ష్మీ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ బిఆర్ఎస్ రైతుర్యాలీకి అనుమతి నిరాకరణ

**ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్న పోలీసులు**

**గ్రౌండ్ లేదా, హాలు లాంటి చోట్ల అయితే అభ్యంతరం లేదని వెల్లడి**

**నల్లగొండ,సెప్టెంబర్1 :** మిర్యాలగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రైతు ర్యాలీ, బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను కారణంగా చూపుతూ కేటీఆర్ ర్యాలీ, మీటింగ్‌కు అనుమతి ఇవ్వలేమని తిరస్కరించారు. ఈనెల 3న మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ వరకు రైతు ర్యాలీ నిర్వహించడంతో పాటు రాజీవ్ చౌక్‌లో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ర్యాలీకి అనుమతి కోరుతూ బీఆర్ఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ రంగం, సాగునీరు, విద్యుత్, యూరియా కొరత, రైతు భరోసా తదితర రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దరఖాస్తులో పేర్కొన్నారు. దీనిపై మిర్యాలగూడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రాజీవ్ చౌక్ ప్రధాన కూడలి కావడంతో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు తరలివస్తే అన్ని వైపుల నుంచి ట్రాఫిక్ నిలిచిపోయే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. రాజీవ్ చౌక్‌కు వచ్చే రహదారులు ఇరుకుగా ఉండటంతో పాటు ఈ ప్రాంతంలో రోజంతా భారీగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయని తెలిపారు. అక్కడ ట్రాఫిక్‌ను మళ్లించేందుకు తగిన ప్రత్యామ్నాయ మార్గాలు కూడా లేవని, వాహనాల పార్కింగ్‌కు సరిపడా స్థలం అందుబాటులో లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోడ్లపై వాహనాలను నిలిపితే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు కోదాడ-జడ్చర్లను కలిపే జాతీయ రహదారి-167 రాజీవ్ చౌక్ మీదుగా వెళ్తుందని పోలీసులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తే జాతీయ రహదారిపై కూడా రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజీవ్ చౌక్ పరిసరాల్లో పలు ప్రభుత్వ, ఇతర ముఖ్య కార్యాలయాలు ఉన్నందున బహిరంగ సభ వల్ల వాటి సాధారణ కార్యకలాపాలకు ఇబ్బంది కలగవచ్చని పోలీసులు తెలిపారు. ర్యాలీ, సభకు అనుమతి ఇస్తే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొంటూ అనుమతిని తిరస్కరించారు. అయితే ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఇతర ప్రాంతాల్లో ఫంక్షన్ హాల్, గ్రౌండ్ వంటి ప్రదేశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం నిర్వహించు కునేందుకు అవకాశం కల్పిస్తామని పోలీసులు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్

**అభినందనలు తెలిపిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,సెప్టెంబర్1 :** సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జగన్‌కు అభినందనలు తెలియజేశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ అరాచకానికి పాల్పడుతుంది

**అందుకు రాంచందర్ రావు అరెస్ట్ నిదర్శనం**

**కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు : బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1 :** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. ఈ అణచివేత చర్య కాంగ్రెస్ ప్రభుత్వ దివాలాకోరుతనానికి, నియంతృత్వ వైఖరికి అద్దం పడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడికి గురైన నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న రాంచందర్ రావును పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అత్యంత హేయమని నితిన్ నబీన్ అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు భౌతిక దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నప్పుడు ప్రేక్షక పాత్ర వహించిన పోలీసు యంత్రాంగం... బాధితులకు అండగా నిలిచేందుకు వెళుతున్న ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పే మాటలన్నీ కేవలం ప్రజలను మభ్యపెట్టే నాటకాలని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ఈ దౌర్జన్యాలు, ప్రతిపక్షాలపై దాడులకు తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతారని నితిన్ నబీన్ హెచ్చరించారు. రాంచందర్ రావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# ఆరోగ్యశాఖలో మరో భారీ నియామక పక్రియ

**1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ**

**మెరిట్ లిస్ట్ విడుదల చేసిన అధికారులు**

**హైదరాబాద్,సెప్టెంబర్1 :** తెలంగాణ ఆరోగ్యశాఖలో మరో భారీ నియామక పక్రియ తుది దశకు చేరుకుంది. 1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను అధికారులు విడుదల చేశారు. అభ్యర్థులను 1:1.25 నిష్పత్తిలో షార్ట్‌లిస్ట్ చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపిక చేశారు. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు సెప్టెంబర్ 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. హైదరాబాద్ వెంగల్‌రావునగర్‌లోని ఎఎఈఊచిలో ఈ ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. నిర్ణీత తేదీల్లో వెరిఫికేషన్‌కు హాజరు కాలేని అభ్యర్థులకు సెప్టెంబర్ 28వ తేదీన మరో అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకురావాల్సి ఉంటుంది. విద్యార్హతలు, ఇతర అవసరమైన ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించనున్నారు. వెరిఫికేషన్ పక్రియ పూర్తయిన అనంతరం ÷నైల్ మెరిట్ లిస్ట్‌తో పాటు సెలక్షన్ లిస్ట్‌ను విడుదల చేయనున్నారు. గత రెండున్నరేళ్లలో తెలంగాణ ఆరోగ్యశాఖలో 15 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీ పక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం మరో 2 వేల పోస్టుల భర్తీ పక్రియ కూడా కొనసాగుతోంది. 1,931 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపిక పక్రియ తుది దశకు చేరుకోవడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌లో చోటు దక్కిన అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీలు, అవసరమైన ధ్రువపత్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# 1000 రోజుల దగాపై నేడు చార్జ్‌షీట్

**తెలంగాణ భవన్‌లో విడుదల చేయనున్న కేటీఆర్**

**కాంగ్రెస్ 420 హామీల ఎగవేతలే ఎజెండాగా**

**నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు**

**రోజుకో అంశంపై సర్కార్‌ను నిలదీసేలా కార్యాచరణ**

**కాంగ్రెస్ బాకీ కార్డుపై ప్రజాక్షేత్రంలో ప్రచారం**

**ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యక్రమాలు**




**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పోరుబాట పట్టనున్నది. అలవికాని హామీలు ఇచ్చి వెయ్యి రోజులు గడిచినా అమలు చేయకుం డా ప్రజలను మోసం చేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్ వేయనున్నది. బుధవారం ఉదయం 11గంటలకు తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు చార్జ్‌షీట్‌ను విడుదల చేయనున్నారు. చార్జ్‌షీట్‌తోపాటు 420 హామీలు, ఆరు గ్యారెంటీల అమలును ప్రశ్ని స్తూ ఈ నెల 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు బీఆర్ఎస్ సేన సిద్ధమైంది. చార్జ్‌షీట్‌తో మొదలయ్యే ఈ పోరాటాన్ని ప్రజాఉద్యమంగా మార్చాలని బీఆర్ఎస్ వ్యూహం రచించింది. బుధవారం నుంచి ధర్నాలు, రైతు సదస్సులు, వంటావార్పులు, యువత ర్యాలీలు, ఆటో ర్యాలీలు, ప్ర జావాణి వినతిపత్రాలు.. ఇలా ప్రతిరోజూ ఒకో అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చుట్టుముట్టేలా బీఆర్ఎస్ కార్యాచరణను సిద్ధం చే సింది. ఈ మేరకు మాజీ మంత్రులు, రాష్ట్ర నేతలు ఎక్కడికక్కడ పార్టీ సన్నాహక సమావేశాల ద్వారా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దేవుండ్ల సాక్షిగా ఒట్లు వేసి గ్యారెంటీ కార్డులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నేతలు.. వాటి అమల్లో ఘోరంగా విఫలమయ్యారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. వం ద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారని, కానీ వెయ్యి రోజులవుతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. 'వెయ్యి రోజులు.. వెయ్యి అబద్దా లు' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్టపై కాంగ్రెస్ బాకీ కార్డులకు మంగళవారం వేముల పూజలు చేసి విడుదల చేశారు. రైతులు, మహిళలు, విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గంలో నిరసనలు ఉధృతం చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా కాంగ్రె స్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను వి వరిస్తూ గ్రామాల్లో ఫ్లెక్సీలు వెలుస్తున్నా యి. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మం డలం ఉప్లూర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో సంక్షేమం మాయమై.. విధ్వంస పాలన సాగుతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. మంగళవారం వనపర్తి బీఆర్ఎస్ భవనంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి మోగించనున్నట్టు తెలిపారు. 6 గ్యారెంటీలు, 420 హామీలు, 11 డిక్లరేషన్లు అమలు చేసే దాకా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. . రేవంత్ సర్కార్ ఒక్క హామీ కూడా అమ లు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. రేవంత్ పాలనలో వెయ్యి రోజుల వైఫల్యాలను ఎండగట్టేందుకు బుధవారం నుంచి వారం నిరసనలుంటాయని తెలిపారు. హామీలు నెరవేర్చేదాకా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాసర్ పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎగ్గొట్టిన హామీలపై నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

**కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా**

**ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు**

**కష్టకాలంలో మేము మాత్రమే కెసిఆర్‌ను వెన్నంటి ఉన్నాం**

**కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ వేముల**




**నిజామాబాద్,సెప్టెంబర్1 :** కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురిని కలిసి రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కెసిఆర్‌కు నమ్మకబంట్లుగా ఉన్న వారిని విడదీసి పార్టీని బలహీన పర్చాలన్న ఎజెండాతో కవిత పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. కవితను కేసీఆర్‌ను కలపడానికి ప్రయత్నం చేసిన, విడగొట్టడానికి ప్రయత్నం చేసిన విషయం కేసీఆర్‌కు బాగా తెలుసు. పార్టీ లైన్ దాటిన తర్వాత కేసీఆర్ కవితను పార్టీ నుంచి వేటు వేశారని అన్నారు. నేను, మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం. 2001 తెలంగాణ ఆవిర్భావానికి ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. టీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అంటేనే టీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చింద్రు.. మధ్యలో పోయింద్రని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత.. ఇప్పుడు కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా.. కవితనా? అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా.. కవితనా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదు. కవిత కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదని చెప్పగలరా? కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో మంతనాలు చేయలేదని చెప్పగలరా?

అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం కవిత చేస్తున్నారు? స్వలాభం కోసం వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని అన్నారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి, పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడంపై స్పందిస్తూ.. రాజకీయంగా సింపతిని గెయిన్ చేయడానికి అని అర్థం అవుతుంది. అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నాం. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయనపైన, కేటీఆర్‌పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కానీ బాధగా అనిపించింది. సొంత లాభం కోసం కవిత మాట్లాడటం పెద్ద బాధగా అనిపించలేదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవితపై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రయోజనాలను సూచించే 'బాకీ కార్డులకు' ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆ హామీలను అమలు చేస్తామని చెప్పిందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 1000 రోజులు పూ-ర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల ద్వారా ఎంత మేర బాకీ పడిందో ప్రజలకు తెలియజేస్తూ, ఇచ్చిన హామీలను ఇకనైనా నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'బాకీ కార్డుల పూజ' కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల ముందుంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎంపీ ల్యాడ్స్ నిధులపై దుష్ప్రచారం తగదు

**ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదు**

**ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ నివేదికపై బండి**



**కరీంనగర్,సెప్టెంబర్1 :** ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై దుష్ప్రచారాలు తగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై బండి స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించు కోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు. 'కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగిన బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళ్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులే మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రజల ముందు ఉంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు.

# ఉగ్రవాద వ్యవస్థని ధ్వంసం చేద్దాం



**ఏకాభిప్రాయంతో ముందుకు సాగుదాం**

**తీవ్రవాదం అంతమే మనందరి లక్ష్యం కావాలి**

**యుద్ధభూమిలో పరిష్కారం లేదు**

**ఎస్ సీవో వేదికపై ప్రధాని మోడీ ఘాటైన సందేశం**

**మోడీ ప్రసంగ సమయంలో సదస్సులోనే ఉన్న పాక్ ప్రధాని**

**జిన్పింగ్, పుతిన్ తదితరులతో ప్రధాని మోడీ కరచాలనాలు.. మాటామంతి**

**బిష్కెక్:** ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ విధానాలకు తావు ఉండకూడదు అని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనైనా, ఏ కారణంతోనైనా సమర్థించడం లేదా ఎంపికచేసి ఖండించడం ప్రపంచ శాంతికి ప్రమాదకరమని పేర్కొన్నారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్సీఓ) 26వ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోడీ ఉగ్రవాదంపై సభ్య దేశాలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించా లంటే దాని నిధుల సమీకరణ, నియామకాలు, తీవ్రవాద భావజాల వ్యాప్తి. సురక్షిత స్థావరాలు వంటి మొత్తం వ్యవస్థను అంత మొందించాలని పిలుపునిచ్చారు. సభ్య దేశాలన్నీ ఈ విషయం లో ఏకాభిప్రాయంతో ముందుకు రావాలని కోరారు. అంతేకా కుండా, ప్రాంతీయశాంతి, భద్రతతో పాటు ఆర్థిక సహకారం, వాణిజ్య అనుసంధానం. మార్కెట్ కనెక్టివిటీని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు. అభివృద్ధి. భద్రత పరస్పరం అనుసంధానమై ఉన్నాయని అయన పేర్కొన్నారు. మోడీ ప్రసంగం చేస్తున్న సమయంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెర్బాజ్ షరీఫ్ కూడా సభలో ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకపోయినా, ఉగ్రవాదా నికి ఆశ్రయం లేదా మద్దతు కల్పించే దేశాలపై పరోక్షంగా విమర్శలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తు న్నారు. యుద్ధభూ మిలో ఏ సమస్యకూ పరిష్కారం లభించద ని, అన్ని యుద్ధా లు, ఘర్షణలకు చర్చలు, దౌత్యం ద్వారానే ముగింపు పలకా లని ఆయన పిలుపునిచ్చారు. ఇరాన్ సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటి అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యం లో మోడీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించు కుంది. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం దేశాలన్నీ పరస్పర సహకారంతో ముందుకు రావాలని మోదీ అన్నారు. భద్రత, అభివృద్ధి, ఆర్థిక సహకారం ఒకదానికొకటి అనుసంధానమై ఉన్నాయని పేర్కొంటూ, విభేదాలను సంభాషణ ద్వారానే పరిష్కరించడం అంతర్జాతీయ సమాజం ముందున్న ప్రధాన బాధ్యత అని తెలిపారు.

### ఫొటోలో మోడీని తొలగించిన పాక్ పీఎంఓ

షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు అనంతరం పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం (పీఎంఓ) విడుదల చేసిన గ్రూప్ ఫొటో వివాదానికి దారితీసింది. అధికారికంగా తీసిన ఫ్యామిలీ ఫొటోలో భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పలువురు ప్రపంచ నేతలు ఉన్నప్పటికీ, పాకిస్థాన్ పీఎంఓ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన చిత్రంలో మోడీ కనిపించకుండా క్రాప్ చేసినట్లు నెటిజన్లు గుర్తించారు. దీంతో ఆ చర్యపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యా యి. ఈ ఫొటోలో షెహ్బాజ్ షరీఫ్ను మాత్రమే ప్రధానంగా కనిపించేలా ఎడిట్ చేశారని, బహుళపక్ష వేదిక మర్యాదలకు ఇది విరుద్ధమని పలువురు వ్యాఖ్యానించారు. ఈ పరిణామం తో షెహ్బాజ్ షరీఫ్ సోషల్ మీడియాలో ట్రోలింగ్కు గురయ్యారు. వివాదం తీవ్రరూపం దాల్చిన తర్వాత పాకిస్థాన్ పీఎంఓ సవరించిన ఫొటోను విడుదల చేసినట్లునివేదికలు వెల్లడించాయి. కొత్త చిత్రంలో ప్రధాని మోడీతో పాటు ఇతర దేశాధినేతలందరూ కనిపించేలా ఫొటోను మళ్లీ ప్రచురించింది.

### పట్టించుకోని పుతిన్.. వెనకాలే షరీఫ్ పరుగు

శిఖరాగ్ర సదస్సులో పాకిస్థాన్ ప్రధాని షెర్బాజ్ షరీఫ్కు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది. అధికారిక గ్రూప్ ఫొటో సెషన్ ముగిసిన వెంటనే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వేదిక నుంచి ముందుకు నడుచుకుంటూ వెళ్లగా, షెర్బాజ్ షరీఫ్ ఆయనను కలిసేందుకు వేగంగా వెనకాలే పరుగులాంటి నడకతో వెళ్లిన దృశ్యాలు చర్చనీయాంశమయ్యాయి. పుతిన్ ముందుకు నడుస్తుండగా, షరీఫ్ త్వరగా ఆయన వద్దకు చేరుకుని చేతిని అందించి పలకరించినట్లు వీడియోలో కనిపిస్తోంది. అనంతరం ఇద్దరు నేతలు కొద్దిసేపు మాట్లాడుకున్నారు. అయితే పుతిన్ స్వయంగా షరీఫ్ వద్దకు వెళ్లకుండా ముందుం స సాగడం, షరీఫ్ ఆయనను వెంబడిస్తూ వెళ్లడం సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీసింది.

### బిష్కెక్ నుంచి స్వదేశానికి ప్రధాని మోడీ

షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళ వారం భారత్ బయల్దేరి వచ్చారు. రెండు రోజులపాటు సాగిన ఈ సదస్సులో సభ్య దేశాల అధినేతలతో కలిసి ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద నిర్మూలన, ఆర్థిక సహకారం, కనెక్టివిటీ, ఇంధన భద్రత వంటి కీలక అంశాలపై మోడీ చర్చలు జరిపారు. సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్తో ప్రత్యేకంగా సమావేశమ య్యారు. అలాగే ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తోనూ సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

**బంగారాన్ని అనవసరంగా కొనకండి**

**డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి**

**దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు**

**దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం**

**ఇన్స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు**



**న్యూఢిల్లీ:** భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్లకు దూరంగా ఉండండి. 'భారత్లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# జిడిపి వృద్ధిరేటు గణాంకాల గారడీ

**ధరలు మోత మోగిస్తుంటే.. వృద్ధి ఎలా సాధ్యం**

**ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్**



**న్యూఢిల్లీ:** భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తు తోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ. 850 నుంచి రూ. 1,700 కి, అల్యూమినియం ధర రూ. 350 నుంచి రూ. 650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ. 50 వేల నుంచి లక్ష రూపాయిలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికులు ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటిమెంట్ను ప్రతిఫలించట్లేదని చెప్పారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపోతుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్ర తి ధ్వ ని స్తు న్నా ర ని విమర్శించారు. ఈ వృద్ధి రేటు భారతీయుల సమష్టి శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వృద్ధి రేటుకు కొనసాగించేందుకు భారతీయులు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.

# అంతులేని శోకాన్ని మిగుల్చిన ప్రళయం

**ఇంకా వరదల్లో 275 మంది భారతీయులు**

**ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు**

**న్యూఢిల్లీ:** నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో చెలరేగిన వినాశకర ప్రళయం అంతులేని శోకాన్ని మిగుల్చింది. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య వెయ్యి దాటగా.. 4,471 మంది ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. గల్లంతైన వారిలో కైలాస మానససరోవర యాత్రకు వెళ్లిన 275 మంది భారత పౌరులతో పాటు మరొక 128 మంది భారత సంతతి వ్యక్తులు ఉన్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. రోజురోజుకూ నదుల్లో మృతదేహాలు కొట్టుకొస్తుండటంతో నేపాల్ శవాగారాలన్నీ నిండిపోయి, మృతదేహాలను భద్రపరచడం, గుర్తించడం అధికారులకు అత్యంత సంక్లిష్టంగా మారింది. గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నేపాల్ ప్రభుత్వం బాధితుల వివరాలతో పవర్ పాయింట్ స్లైడ్షోలను కూడా సిద్ధం చేసింది. ఈ విపత్కర పరిస్థితిలో మృతుల కుటుంబాలకు సహాయం అందించేందుకు ఖాఠ్మండులోని భారత రాయబార కార్యాలయం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. నేపాల్ ప్రభుత్వం వెబ్సైట్లో విడుదల చేస్తున్న ఫోటోలు, వివరాల ద్వారా మృతదేహాలను గుర్తించిన పక్షంలో.. భౌతికకాయాలను స్వదేశానికి తరలించేందుకు స్థానిక అధికారులతో సమన్వయం చేస్తామని ఎంబసీ తెలిపింది. దీనికోసం నేపాల్ ప్రభుత్వం రూపొందించిన 9 అంచెల నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా మృతదేహ అవశేషాల డాక్యుమెంటేషన్, లభ్యమైన ఫోటోలు, వివరాలను నమోదు చేయాలి. అలాగే పోస్టుమార్టం నిర్వహణ, మరణానికి గల కారణాల నిర్ధారణ, అధికారికంగా వ్యక్తి గుర్తింపు, వేలిముద్రలు, డీఎన్ఏ, ఫోరెన్సిక్ శాంపిళ్ల సేకరణ, మృతుడి పాస్పోర్ట్ లేదా ఐడీ వెరిఫికేషన్, ఎంబసీ లేదా కాన్సులర్ సమన్వయ ప్రక్రియ పూర్తి, హ్యాండోవర్ మెమో, రసీదుల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మృతదేహాలు బాగా కుళ్లిపోయి, ఆకృతులు దెబ్బతినడంతో గుర్తింపు ప్రక్రియ కష్టసాధ్యంగా మారింది. దీంతో నేపాల్ అధికారులు తాత్కాలిక పూడ్చివేతలను ప్రారంభించారు. ప్రతి శరీరానికి డీఎన్ఏ నమూనా తీసుకుని, ప్లాస్టిక్ బ్యాగ్లో ఉంచి ట్యాగ్, లోకేషన్ నంబర్ను కేటాయించి పూడ్చి పెడుతున్నారు. భవిష్యత్తులో డీఎన్ఏ మ్యాచ్ అయినప్పుడు కుటుంబ సభ్యులకు భౌతికకాయాల అవశేషాలను అప్పగించి తుది సంస్కారాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

# తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

**తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు**

**ఇప్పడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్**

**వాషింగ్టన్:** అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు. 'హెగ్సెత్ అద్భుతంగా పనిచేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్లో హెగ్సెత్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది. అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ నేషనల్ గార్డ్లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పలువురు నేతలు ఇప్పటికే అంతర్గతంగా సన్నాహాలు ప్రారంభించి ఉండొచ్చని ట్రంప్ చెప్పారు. ఏది ఏమైనా ట్రంప్ వారసుడిగా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించనప్పటికీ.. జేడీ వాన్స్, మార్కో రూబియో, హెగ్సెత్ వంటి పేర్లు వినిపిస్తుండటం రిపబ్లికన్ పార్టీలో 2028 పోరుపై ఆసక్తి రేపుతోంది.

# రష్యా సైన్యంలో 51 మంది భారతీయలు మృతి

**విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడి**

**న్యూఢిల్లీ:** రష్యా సైన్యంలోని 51 మంది భారతీయులు మరణించారని విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడించారు. మొత్తం 227 మంది రష్యాలో సైన్యంలో చేరగా ఇప్పటివరకూ 139 మంది బయటకు వచ్చేశారని అన్నారు. మిగిలిన వారినీ వెనక్కు తీసుకొచ్చేందుకు రష్యాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కిర్గిస్థాన్ పర్యటన నేపథ్యంలో సోమవారం మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సెక్రటరీ ఈ వివరాలను వెల్లడించారు. ఈ అంశంలో రష్యాతో వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయని మిశ్రీ చెప్పారు. మాస్కోలోని భారతీయ ఎంబసీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భారతీయులను వెనక్కు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. భారతీయులు త్వరగా సైన్యం నుంచి డిశ్చార్జ్ అయ్యేలా రష్యా చర్చలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. రష్యా-భారత్ వాణిజ్యం గురించి కూడా మిశ్రీ మాట్లాడారు. గతేడాది భారత్లో రష్యన్ దిగుమతిదారుల సమావేశంలో అక్కడి సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. భారత్ నుంచి దిగుమతులను పెంచేందుకు ఉత్సుకత ప్రదర్శించాయని చెప్పారు. తదుపరి రష్యాలో జరుగునున్న సమావేశంలో భారతీయ ఎగుమతిదారుల ఫోరం సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సానుకూలంగా స్పందించారని అన్నారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఇటీవల కిర్గ్ రిపబ్లిక్ దేశ పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడు పుతిన్తో కూడా సమావేశం అయ్యారు. యుద్ధాలకు శాశ్వత ముగింపు పలికేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# భారత్కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

**రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్**

**న్యూఢిల్లీ:** 'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్కు విక్రయించేందుకు రష్యా అంగీకరించి నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్-400.. గతేడాది ఆపరేషన్ సిందూర్లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్-400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్కాస్ట్లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్-400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్-400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్-400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది.

# ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు ఎంపిక

## బుమ్రా రీఎంట్రీ, శ్రేయస్‌కే కెప్టెన్సీ



ఆఫ్ఘనిస్థాన్‌తో స్వదేశంలో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం టీమిండియా జట్టును ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్‌కే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించగా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గాయం కారణంగా కొంతకాలంగా జట్టుకు దూరమైన స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌తో పునరాగమనం చేయడం అభిమానులకు శుభవార్త. అయితే, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డిల ఎంపిక వారి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ సిరీస్‌కు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుండగా, సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. జింబాబ్వే పర్యటనకు ఎంపిక కాని వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చాడు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, శివమ్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి వంటి ఆటగాళ్లు జట్టులో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. జింబాబ్వే పర్యటనలో భాగమైన ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్‌లకు ఈసారి చోటు దక్కలేదు. ఇక, హార్దిక్ పాండ్యాకు జట్టులో స్థానం లభిస్తుందన్న ఊహాగానాలకు తెరదించుతూ, సెలక్టర్లు అతడిని పరిగణనలోకి తీసుకోలేదు.

### గాయాల నుంచి కోలుకుని కీలక ఆటగాళ్లు

జూలైలో ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గాయపడిన బుమ్రా, అప్పటి నుంచి ఆటకు దూరంగా ఉన్నాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన టెస్ట్ సిరీస్‌కు కూడా అతను దూరమయ్యాడు. అదేవిధంగా, ఇంగ్లండ్‌తో వన్డేలలో తొడ కండరాల గాయంతో బాధపడిన వాషింగ్టన్ సుందర్ కూడా తిరిగి జట్టులోకి రావడం బౌలింగ్ విభాగానికి బలాన్ని చేకూర్చనుంది. గతంలో మోకాలి గాయంతో టీ20 ప్రపంచకప్‌కు దూరమై, ఆ తర్వాత పునరాగమనం చేసిన హర్షిత్ రాణా, మళ్లీ గాయపడి ఇప్పుడు కోలుకుని జట్టులోకి ఎంపికయ్యాడు. అయితే వీరు ఫిట్‌నెస్ క్లియరెన్స్ సాధించాల్సి ఉంటుంది.

### ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌కు భారత జట్టు:

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.



## చాలా నమ్మకంగా ఉన్నా

### టీమిండియాలోకి రీఎంట్రీపై రుతురాజ్ గైక్వాడ్ ధీమా

టీమిండియాలోకి తిరిగి రావడంపై భారత బ్యాటర్, చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ పూర్తి విశ్వాసంతో ఉన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో పరుగులు సాధిస్తూ తన స్థానాన్ని తిరిగి సంపాదించుకోవడంపైనే దృష్టి పెట్టినట్లు చెప్పాడు. అవకాశం వచ్చినప్పుడు సత్తా చాటేందుకు సిద్ధంగా ఉంటానని తెలిపాడు. టీమిండియాలోకి పునరాగమనంపై మంగళవారం కోయంబత్తూర్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా రుతురాజ్‌ను మీడియా ప్రశ్నించింది. దీనికి స్పందిస్తూ.. "చాలా నమ్మకంగా ఉన్నా. మళ్లీ వెళ్లి పరుగులు చేయడంపైనే దృష్టి. ఇన్నాళ్లూ పరుగులు సాధిస్తూనే ఉన్నా. ఇక నిలకడగా రాణిస్తూ అవకాశం కోసం ఎదురుచూడాలి" అని చెప్పాడు. ప్రస్తుతం జాతీయ జట్టులో చోటు కోసం దేశవాళీ క్రికెట్‌లో రుతురాజ్ తనను తాను నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. తన బ్యాటింగ్‌పై నమ్మకం ఉందని స్పష్టం చేశాడు. దేశవాళీ సీజన్ మొదలుకానున్న నేపథ్యంలో రాబోయే టోర్నీలపై దృష్టి పెట్టినట్లు తెలిపాడు. ఇదిలా ఉంటే.. ఆఫ్ఘనిస్థాన్‌తో భారత్ తలపడనున్న నేపథ్యంలో రషీద్ ఖాన్, యువ భారత బ్యాటర్ సూర్యవంశీ మధ్య ఆసక్తికర పోరు ఉంటుందా? అని రుతురాజ్‌ను అడిగారు. అయితే ఈ పోరుపై తాను పెద్దగా ఆలోచించలేదని చెప్పాడు. "మీరు మీ దేశానికి మద్దతు ఇవ్వాలని కోరుకుంటారు.. నేనూ అంతే, నా దేశానికి మద్దతివ్వాలని కోరుకుంటాను" అని అన్నాడు. జట్టులో లేనప్పుడు తాను మ్యాచ్‌లను ఎక్కువగా చూడనని తెలిపాడు. ప్రస్తుతం తన సాధనపైనే ఎక్కువగా దృష్టి పెట్టినట్లు రుతురాజ్ తెలిపాడు. ప్రాక్టీస్‌తో పాటు దేశవాళీ టోర్నీలు కూడా ఉండటంతో టీమిండియా మ్యాచ్‌లను రోజూ చూడటం సాధ్యం కావడం లేదన్నాడు.

దులీప్ ట్రోఫీ తర్వాత ఇరానీ కప్ జరగనుంది. ఆ తర్వాత రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టోర్నీలు ఉన్నాయి. ఈ టోర్నీల్లో రాణించి మరోసారి భారత జట్టులో చోటు దక్కించుకోవాలని రుతురాజ్ చూస్తున్నాడు.


## ముంబైతోనే హార్దిక్? కానీ కెప్టెన్‌గా కాదు..

### కొత్త సారథి రేసులో హైదరాబాదీ ప్లేయర్!

ఐపీఎల్ వర్గాల్లో కొన్ని నెలలుగా హాట్ టాపిక్‌గా మారిన స్టార్ ఆల్-రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజా సమాచారం ప్రకారం హార్దిక్ పాండ్యా ఐపీఎల్ 2027 సీజన్‌లో కూడా ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్టుతోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, అతనికి కెప్టెన్సీ బాధ్యతలు మాత్రం దక్కకపోవచ్చని తెలుస్తోంది. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ప్రచురించిన ఒక కథనం ప్రకారం, హార్దిక్ ట్రేడింగ్ కోసం జరిపిన చర్చలు ఇప్పటివరకు ఫలించకపోవడంతో అతడిని జట్టులోనే కొనసాగించే దిశగా యాజమాన్యం ఆలోచిస్తోంది.

### కొత్త కెప్టెన్ వేటలో ముంబై యాజమాన్యం

ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ కొత్త కెప్టెన్ నాయకత్వంలో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. జట్టుకు ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మ, మళ్లీ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించడానికి సుముఖంగా లేడు. అయితే, తదుపరి సారథి ఎంపిక కోసం జరుగుతున్న చర్చల్లో అతడు చురుగ్గా పాల్గొంటున్నాడని ఆ కథనం పేర్కొంది. ప్రస్తుతం కొత్త కెప్టెన్ రేసులో యువ ఆటగాడు, హైదరాబాదీ ప్లేయర్ తిలక్ వర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అతనితో పాటు సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా పేరును కూడా యాజమాన్యం పరిశీలిస్తోంది. ప్రస్తుతానికైతే తిలక్ వర్మకే ఎక్కువ అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.



### ఫలించని ట్రేడింగ్ చర్చలు

హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ విషయానికొస్తే, ముంబై యాజమాన్యం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో (కేకేఆర్) చర్చలు జరిపింది. ఈ చర్చల్లో భాగంగా ఆస్ట్రేలియా ఆల్-రౌండర్ కామెరాన్ గ్రీన్‌ను ఇచ్చేందుకు కేకేఆర్ ఆసక్తి చూపింది. అయితే, వచ్చే ఏడాది గ్రీన్ వర్క్‌లోడ్‌పై ఉన్న సందేహాల కారణంగా ముంబై ఇండియన్స్ ఈ డీల్‌కు అంగీకరించలేదని సమాచారం. మరోవైపు, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తమ కొత్త హెడ్ కోచ్‌ను నియమించుకున్న తర్వాత వారితోనూ చర్చలు జరిపే అవకాశం ఉంది. "ఒక ఆటగాడి ట్రేడింగ్ జరగాలంటే చాలా అంశాలు కలిసిరావాలి. అందుకే ఈ ప్రక్రియ అంత సులభం కాదు. బహుశా అతడిని ట్రేడ్ చేయకపోవచ్చు. ఈ విషయంపై ఆటగాడితో కూడా చర్చలు జరిగాయి" అని ఈ పరిణామాలను గమనిస్తున్న వర్గాలు వెల్లడించినట్టు ఆ కథనం పేర్కొంది.

### సూర్యకుమార్, జయవర్ధనే భవితవ్యంపై స్పష్టత

గత 2026 సీజన్‌లో పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడిన స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌ను ముంబై ఇండియన్స్ అట్టిపెట్టుకోనుంది. కేవలం ఒక సీజన్ ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను వదులుకోవడం ముంబై పనితీరు కాదని, 'వన్ ఫ్యామిలీ' అనే ట్యాగ్‌కు కట్టుబడి ఉంటామని యాజమాన్య వర్గాలు స్పష్టం చేశాయి. దీంతో సూర్యకుమార్ ఐపీఎల్ 2027లో కూడా ముంబై తరఫునే ఆడటం ఖాయమైంది. అలాగే, హెడ్ కోచ్ మహేల జయవర్ధనే కూడా తన పదవిలో కొనసాగనున్నాడు. 2027 ఐపీఎల్ సీజన్ తర్వాత మెగా వేలం జరగనుండటంతో, జట్టులో భారీ మార్పులు చేయడానికి ఫ్రాంచైజీలు వెనుకాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ కూడా సమూల మార్పులకు బదులు, స్థిరత్వానికే ప్రాధాన్యత ఇస్తూ ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు స్పష్టమవుతోంది.

## సీఎస్కేలో ధోనీ వాటా.. వదంతులను ఖండించిన సీఈవో

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఫ్రాంచైజీలో ఆ జట్టు మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ వాటా కోరుతున్నట్లు వస్తున్న వార్తలను సీఎస్కే యాజమాన్యం ఖండించింది. ఈ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని, అవన్నీ కేవలం నిరాధారమైన వదంతులని సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. దీంతో గత కొన్ని రోజులుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది. ఐపీఎల్ ప్రారంభం నుంచి సీఎస్కేతో ధోనీకి విడదీయరాని అనుబంధం ఉంది. అతడి సారథ్యంలో జట్టు ఏకంగా ఐదుసార్లు ఐపీఎల్ టైటిళ్లను కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో, ఫ్రాంచైజీతో తన బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే క్రమంలో ధోనీ సుమారు 20 శాతం వాటాను



కొనుగోలు చేయాలని భావిస్తున్నాడని, కానీ సీఎస్కే యాజమాన్యం కేవలం 3 శాతం మాత్రమే ఆఫర్ చేసిందని కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలతో ఇరువర్గాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని కూడా జోరుగా ప్రచారం జరిగింది. ఈ వదంతులపై కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ, "ధోనీ వాటా అడిగాడన్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదు. అవన్నీ కేవలం పుకార్లు మాత్రమే" అని కొట్టిపారేశారు. ఇక వచ్చే సీజన్‌లో ధోనీ ఆడతాడా లేదా అనే విషయంపై కూడా ఆయన వివరణ ఇచ్చారు. "వచ్చే సీజన్‌లో తాను ఆడనని ధోనీ మాతో ఎప్పుడూ చెప్పలేదు. ఏదైనా అతడిదే తుది నిర్ణయం" అని తెలిపారు. కాగా, 2025 మెగా వేలానికి ముందు సీఎస్కే ధోనీని రూ. 4 కోట్లకు రిటైన్ చేసుకుంది. అయితే, గాయం కారణంగా 2026 సీజన్‌లోని



## 'రోమాంచకం'లో బబ్లీ గర్ల్ పాత్ర.. నా కల నెరవేరింది

బ్లాక్‌బస్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, భద్రకాళి పిక్చర్స్ పతాకంపై సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'రోమాంచకం'. ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ చిత్రంతో వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం చిత్ర హీరోయిన్ అనంతిక మీడియాతో ముచ్చటించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా అనంతిక మాట్లాడుతూ, "'8 వసంతాలు' తర్వాత చాలా కథలు విన్నాను. కానీ ఏదీ నన్ను అంతగా ఆకట్టుకోలేదు. ఆ సమయంలో 'రోమాంచకం' కథ వినగానే చాలా సంతోషం వేసింది. నేను చేయాలనుకున్న సినిమా ఇదే అనిపించింది. ఈ సినిమాలో బబ్లీగా, సరదాగా ఉండే అమ్మాయి పాత్ర నాది. ఇలాంటి పాత్ర చేయాలని ఎప్పటినుంచో కలలు కన్నాను" అని తెలిపారు. "ఈ చిత్రం యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. ఇది కేవలం ప్రేమకథ మాత్రమే కాదు, ఇందులో హాస్యంతో పాటు ఉత్కంఠ కూడా ఉంటుంది. యూత్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేయవచ్చు. ఇందులో నేను తమిళ అమ్మాయిగా కనిపిస్తాను. హీరో సుమంత్ ప్రభాస్ పాత్ర చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. దానికి తగ్గట్టుగానే నా పాత్రను కూడా డిజైన్ చేశారు. మా ఇద్దరి మధ్య సంభాషణలు చాలా సహజంగా, వేగంగా సాగుతాయి" అని ఆమె వివరించారు. రోమాంచకం సినిమా చిత్రీకరణ అనుభవాల గురించి చెబుతూ, "షూటింగ్ సమయంలో ఎంత సరదాగా గడిపామో, సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా అంతే ఎంజాయ్ చేస్తారు. సందీప్ గారు నా నటనను మెచ్చుకోవడం సంతోషంగా ఉంది. నిర్మాత ప్రణయ్ రెడ్డి గారిని మొదట చూసినప్పుడు కోపం ఎక్కువ అనుకున్నాను, కానీ ఆయన చాలా సరదా మనిషి. సుమంత్ ప్రభాస్‌తో తొలిరోజే మంచి స్నేహం కుదిరింది" అంటూ షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు. చిన్నప్పటి నుంచి తనకు కళలంటే ఇష్టమని, ఎల్‌కేజీ నుంచే డ్యాన్స్ నేర్చుకుంటున్నానని, ఆ అనుభవమే నటిగా తనకు ఎంతగానో ఉపయోగపడుతోందని అనంతిక పేర్కొన్నారు. మంచి అవకాశాలు వస్తే ఏ భాషలోనైనా నటిస్తానని ఆమె స్పష్టం చేశారు.

చివరగా, "రోమాంచకం సినిమాలో ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే మూడు అంశాలు బలంగా ఉంటాయి. ముఖ్యంగా ప్రేమ నుంచే ఉత్కంఠ పుట్టడం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమా నాకే కాకుండా హీరోకి కూడా మంచి గుర్తింపు తెస్తుందని నమ్ముతున్నాను. ప్రస్తుతం తెలుగు, తమిళ, మలయాళంలో కొన్ని ప్రాజెక్టుల చర్చలు జరుగుతున్నాయి" అని ఆమె ముగించారు.

## మారెమ్మ ట్రైలర్ విడుదల



మాస్ మహారాజ రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు ప్రధాన పాత్రలో తెరకెక్కిన విలేజ్ యాక్షన్ డ్రామా 'మారెమ్మ' ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిన టీజర్‌తో సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. ఇప్పుడు ట్రైలర్ ద్వారా కథకు సంబంధించిన మరిన్ని ఆసక్తికర అంశాలను ప్రేక్షకులకు పరిచయం చేసింది. గ్రామీణ నేపథ్యం, దైవ విశ్వాసాలు, మూఢనమ్మకాలు, యాక్షన్ అంశాలను మేళవిస్తూ ఈ సినిమాను తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కథ విషయానికి వస్తే.. ఓ సంక్షోభంలో చిక్కుకున్న గ్రామస్తులు తమ గ్రామ దేవత మరెమ్మ తల్లిపై నమ్మకం పెట్టుకుంటారు. అయితే అమ్మవారికి సంబంధించిన పవిత్రమైన ఎద్దు అనూహ్యంగా కనిపించకుండా పోవడంతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలు మొదలవుతాయి. ఆ ఎద్దు అదృశ్యం కావడం వెనుక ఏదో పెద్ద కారణం ఉందని గ్రామస్తులు భావిస్తారు. ఈ పరిణామాల నేపథ్యంలో యువ కథానాయకుడిపై ఆ ఎద్దును వెతికి తీసుకురావాల్సిన బాధ్యత పడుతుంది. ఎద్దు కోసం అతడు చేసే అన్వేషణ క్రమంలో ఎన్నో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. గ్రామంలో పాతుకుపోయిన నమ్మకాలు, స్థానిక రాజకీయాలు, ఆధిపత్య పోరాటాలు అతడి ప్రయాణాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తాయి. ఈ క్రమంలో హీరో పలు హింసాత్మక సంఘర్షణల్లో చిక్కుకున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. అయితే 'మారెమ్మ' కథలో అసలు మిస్టరీ ఏమిటన్నది మాత్రం ట్రైలర్‌లో పూర్తిగా రివీల్ చేయలేదు. పవిత్రమైన ఎద్దు ఎందుకు కనిపించకుండా పోయింది? దాని వెనుక ఎవరి హస్తం ఉంది? హీరో ఎదుర్కొనే సమస్యలకు, గ్రామ దేవత నమ్మకాలకు ఉన్న సంబంధం ఏమిటి? అనే ప్రశ్నలను అలాగే ఉంచుతూ ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేశారు. ముఖ్యంగా గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నాయి. ఉత్కంఠభరితమైన సన్నివేశాలకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత బలాన్ని చేకూర్చింది. సాధారణ విలేజ్ డ్రామాకు భిన్నంగా దైవ విశ్వాసం, గ్రామీణ ఆచారాలు, మిస్టరీ, యాక్షన్ అంశాలను కలిపి కథను నడిపించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో దీపా బాలు కథానాయికగా నటించగా.. వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, వీఎస్ రూపలక్ష్మి, దయానంద్ రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్న ఈ చిత్రానికి మంచాల నాగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ట్రైలర్‌తో సినిమాపై మరింత ఆసక్తిని పెంచిన 'మారెమ్మ' సెప్టెంబర్ 10న థియేటర్లలోకి రానుంది. గ్రామీణ నేపథ్యంలోని మిస్టరీ, యాక్షన్ కథలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి.

## కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్ మరియు పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.



## నవంబర్ 27న మైసా విడుదల

### రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.



## మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బెం÷-లతెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పాలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటి రూ.250 కోట్ల దిశగా దూసుకుపోతోంది. దీన్నే తెలుగులో సెప్టెంబరు 4న విడుదల చేయనున్నారు.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342